క్లుప్తంగా

20న సర్వసభ్య సమావేశం

శావల్యాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 20న ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అధ్యక్షతన సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిధిగా స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ ఛీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరు అవుతారన్నారు. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మండల గ్రామస్థాయి అధికారులు హాజరు కావాలన్నారు.

యోగాతో పరిపూర్ణ జీవనం



నరసరావుపేట ఈస్ట్: యోగాభ్యాసం ద్వారా పరిపూర్ణమైన జీవనాన్ని అనుభవించవచ్చని శ్రీవేంకటేశ్వర యోగ సేవా కేంద్రం (మంగళగిరి) ప్రధాన ఆచార్యుడు ఆతుకూరి వేంకటేశ్వర యోగి గురూజీ తెలిపారు. యోగా సేవా కేంద్రం నరసరావుపేట రూరల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 7వ ఉచిత యోగ శిక్షణ శిబిరం ముగింపు, కేంద్రం 32వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో యోగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వేంకటేశ్వర గురూజీ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అభ్యాసకులతో మాట్లాడుతూ, నిత్యం యోగను సాధన చేయాలని సూచించారు.రూరల్ శాఖ నిర్వాహకుడు జల్లి శ్రీనివాసరావు, చిలకలూరిపేట యోగా గురువులు కాపుగంటి శివప్రసాదరావు, కనమర్లపూడి శారద, సహాయ గురువులు బండి కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

నాదెండ్ల: పాల వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించటంతో పాటూ రైతులకు చేయూతనందించటంలో సంగం డెయిరీ అగ్రగామిగా ఉంటుందని డెయిరీ పాలక మండలి సభ్యుడు పావులూరి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని కనపర్రు పాలకేంద్రంలో పాడి రైతులకు సంగం డెయిరీ రూ.3.16 లక్షల బోనస్ పంపిణీ చేశారు. పాలకేంద్రం అధ్యక్షుడు మెడబలిమి ప్రతాప్, నరసరావుపేట మేనేజర్ నరేష్‌బాబు, సూపర్‌వైజర్ వసంతరావు, పాలకేంద్రం సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



నరసరావుపేట ఈస్ట్: పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్మాణం జరుపుకోనున్న శ్రీరామకృష్ణా ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు శంకుస్థాపన చేసారు. ఇటీవల నిర్వహించిన పాఠశాల వజ్రోత్సవాల్లో పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈమేరకు దాదాపు రూ.10 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. పాఠశాల పూర్వ విద్యార్థులు కపలవాయి విజయకుమార్, వి.వి.అంజనీకుమార్, జూలకంటి సీతారామాంజనేయులు, రిటైర్డ్ హెచ్‌ఎం వై.త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలేశమ్మకు బోనాలు



నాదెండ్ల: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో కొలువైయున్న ఢిల్లీ పోలేశమ్మ తల్లి పొంగళ్లను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పెదకాపు యర్రగర్ల పోతురాజు, గ్రామ పెద్దలు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు పొంగించి నైవేద్యాలు, వడపప్పు పానకం సమర్పించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి గ్రామ మహిళలు బోనాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం సాంప్రదాయబద్ధ మేళతాళాలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రతి ఏటా సకాలంలో వర్షాలు కురిసి సమృద్ధిగా పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

ఘనంగా అంకమ్మతల్లి జాతర



రొంపిచర్ల: మండలంలోని తురుమెళ్ళ గ్రామంలో వేంచేసియున్న అంకమ్మ తల్లి జాతర మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఈ జాతర ఉత్సవాలు ఆచార సాంప్రదాయాలతో, ఘణాచారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముగింపు సందర్భంగా భారీ అన్నదానం నిర్వహించారు. చుట్టాలు, బంధుమిత్రులతో గ్రామంలో తిరునాళ్ళ వాతావరణం నెలకొంది.

14 నెలల్లో అధ్వాన పేటగా మార్చారు

- కూటమి ప్రభుత్వంలో తీసికట్టుగా పారిశుద్ధ్యం
- ఒక వైపు కుళ్లిపోయిన చెత్త, మరొకవైపు తాగి పడేసిన మద్యం సీసాలు
- 'గుడ్ మార్నింగ్ నరసరావుపేట'లో పలు వీధుల్లో పర్యటించిన డాక్టర్ గోపిరెడ్డి
- తక్షణమే పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని డిమాండ్



పట్టణంలోని 12వ వార్డులో నడిరోడ్డుపై నిలిచిన మురుగు నీటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: కూటమి పాలనలో 200 ఏళ్ల చరిత్ర గల నరసరావుపేట పట్టణం ఎటువైపు పోతుందో అర్థం కావడం లేదని, 14 నెలల్లో పట్టణాన్ని అధ్వాన పేటగా మార్చారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గుడ్‌మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఆదివారం స్థానిక కుమ్మరి బజార్, రైల్వేస్టేషన్ ఫస్ట్‌గేట్ సెంటర్, షాలెంనగర్ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలపై పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పట్టణంలోని కుమ్మరి బజారులో పది రోజులుగా చెత్త తీయడం లేదని ఆ ప్రాంతమంతా కుళ్లిపోయిన చెత్తవలన దుర్వాసనతో నిండిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతుందనీ అన్నారు.

- రైల్వేస్టేషన్ ఫస్ట్‌గేటుకు 25 మీటర్ల దూరంలో ఉన్న ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్ ఎదురు పెద్ద చెత్త కుప్పలు ఉన్నాయని, వాటి ఎదురు ఆకతాయిలు తాగిపడేసిన బీరు, మందు బాటిల్స్ ఉన్నాయన్నారు. ఆ ఏరియాలో మహిళా బాలికల హాస్టల్, నివాస ప్రాంతాలు ఉన్నాయని, మందు బాబులతో తాము ఎంతో ఇబ్బందికరంగా ఉందని మహిళలు వాపోతున్నారని చెప్పారు.
- షాలెంనగర్‌లో తమకు రోడ్డుకు ఇరువైపులా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని ఈ ప్రాంతంలో అసలు చెత్త తీయటమే మర్చిపోయారని అన్నారు. కాలువలు ఆరు నెలల నుంచి శుభ్రం చేసే నాధుడే లేదని, ఈ ప్రభుత్వంలో పారిశుద్యం అధ్వానంగా మారిందని, తాము ఈ కార్యక్రమంలో భాగంగా ఎటువైపు వెళుతున్నామో మెసేజ్ పెడితే అటువైపు మాత్రమే చెత్త తీస్తున్నారన్నారు.
- మున్సిపాలిటీలో సుమారు రూ.2 కోట్లు నిధులు ఉన్నాయని, కానీ ఏ కాంట్రాక్టర్ పనిచేయడానికి ముందు రావట్లేదని చెప్పారు. 14 నెలల కాలంలో కేవలం రెండు కల్వర్టులు మాత్రమే నిర్మించారని, అభివృద్ధి కార్యక్రమాలు ఒక్కటీ చేయలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే మూడు నెలలు పారిశుద్ధ్యంపై హంగామా చేసి మురిపించారని, ఆ తర్వాత పట్టించుకోవడం మానేశారని అన్నారు. వీధిలో లైట్‌పోతే ఆ లైట్ వేయడానికి కనీసం మూడు నుంచి నాలుగు నెలల సమయం పడుతుందన్నారు. మున్సిపల్ విభాగ జిల్లా అధ్యక్షులు షేక్ రెహమాన్, పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ కరిముల్లా, వర్కింగ్ అధ్యక్షులు నిడమానూరి సురేంద్ర, అచ్చి శివకోటి, సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి మాష్టారు, మాదిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కందుల ఎజ్రా, బీసీ విభాగ పట్టణ అధ్యక్షుడు మర్రిపూడి రాంబాబు, కామిరెడ్డి నరసిరెడ్డి, సానికొమ్ము రమణారెడ్డి, ఆరుదల సాంబశివరావు, మద్దిరెడ్డి నరసింహారెడ్డి, ఎస్‌కే ఆంజనేయులు, సయ్యద్ ఖాదర్‌బాష, షేక్ సర్దార్, వరవకట్ట బుజ్జి, షేక్ నాగూల్‌మీరా, బాదుగున్నల శ్రీను తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోదండ రామాలయం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



నూతన కమిటీ సభ్యులు

నాదెండ్ల: గణపవరంలో కొలువైయున్న శ్రీ కోదండ రామాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి దర్శి అనిల్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజల అనంతరం గోత్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా కాటా వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా జంపని వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా గుర్రం ఆదినారాయణ, కోశాధికారిగా గాలి బుచ్చయ్య, జాయింట్ సెక్రటరీగా నార్నె శివయ్య ప్రమాణస్వీకారం చేశారు. గౌరవ అధ్యక్షుడిగా ఉన్న మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు కాటా రత్తయ్యలు నూతన సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కండువాలు కప్పి ప్రసాదాలు అందించారు. మరో 14 మంది సభ్యులుగా కొనసాగనున్నారు. వీరి కాలపరిమితి ప్రతి రెండేళ్లకోసారి శ్రావణ మాసం వరకు కొనసాగుతుందన్నారు.

21,22 తేదీల్లో క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరం



సామినేని కోటేశ్వరరావు

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత ప్రజలకు సామినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ సామినేని కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సామినేని పానయ్య, నాగరత్నమ్మ స్మారకార్థం కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ హైదరాబాద్, బసవతారకం ఇండో – అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ సహకారంతో ఈ శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలోని బోయపాలెం శ్రీఅనంత లక్ష్మి స్పిన్నింగ్ మిల్లు ఆవరణలో ఈనెల 21, 22వ తేదీల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. అత్యాధునిక పరికరాలు కలిగిన మొబైల్ వాహనంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు వివరించారు. మామోగ్రఫీ, గర్భసంచికి స్కానింగ్, పాప్స్ మీయర్, ఊపిరితిత్తులకు ఎక్స్‌రే వంటి పరీక్షలు హైదరాబాద్ నుంచి వైద్య బృందం హాజరై నిర్వహిస్తారని పేర్కొన్నారు. శిబిరంలో వ్యాధి నిర్ధారణ అయిన వారికి, తెల్ల రేషన్ కార్డు ద్వారా హైదరాబాద్‌లోని బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉచిత చికిత్స పొందే అవకాశం కల్పిస్తారని చెప్పారు. శిబిరానికి హాజరైన వారికి భోజన సదుపాయాలు కూడా ఏర్పాటు చేసినట్లు మిల్లు ఎండీ సామినేని కోటేశ్వరరావు పేర్కొన్నారు. ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ వ్యాధినిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు టి.నాసరయ్య: 88865 19121, కె.సురేష్: 99121 17887లను సంప్రదించాలన్నారు.

'స్వామిత్వ' పునఃప్రారంభం



యడ్లపాడులో స్వామిత్వ కింద సర్వే నిర్వహిస్తున్న అధికారులు

యడ్లపాడు: గ్రామీణ ప్రాంత నివాస గృహాలు, ఖాళీ స్థలాలపై గుర్తింపు పక్రియ స్వామిత్వ కార్యక్రమం మండలంలో మళ్లీ మొదలైంది. కేంద్రం రూపొందించిన ఈ పథకం 2020న అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ప్రారంభమైంది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుల కింద ఎంపిక చేసిన గ్రామాలతో పాటు యడ్లపాడు మండలంలోని మర్రిపాలెం, దింతెనపాడు గ్రామాల్లో స్వామిత్వ సర్వే పక్రియ విజయవంతం అయింది. అప్పట్లో సర్వే పూర్తయిన ఈ రెండు గ్రామాల్లోని ప్రజలకు ఆస్తి ధ్రువపత్రాలను పంపిణీ చేయడం జరిగింది. అయితే మండలంలో మిగిలిన 10 రెవెన్యూ గ్రామాల్లో తిరిగి సర్వే పనుల్ని అధికారులు ప్రారంభించారు. గతంలోనే గ్రామాల్లో గ్రామ కంఠాల సరిహద్దులను గుర్తించడం పూర్తికావడంతో ఆయా గ్రామాల్లోని 13,600 ఇళ్లు, ఖాళీ స్థలాల సర్వే నిర్వహించనున్నారు. ఈ ఏడాది అక్టోబర్ చివరి నాటికి స్వామిత్వ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా చేసుకున్నారని ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. సర్వే ప్రక్రియ ముగించాక ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలపై గ్రామ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. వారి సమస్యల పరిష్కారం అనంతరం వారి ఆస్తులకు చట్టబద్ధత కలిగిన ధ్రువ పత్రాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. సర్వే నిమిత్తం గ్రామాల్లోని ఇళ్లకు వచ్చిన సర్వేబృందాలకు క్షేత్రస్థాయిలో సమగ్ర సమాచారం అందించి ప్రజలు సహకరించాలని కోరారు.

జనసేవా దళ్ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: సీపీఐ ఆధ్వర్యంలో ఆదివారం పార్టీలో అంతర్భాగమైన జనసేవాదళ్ కార్యకర్తల శిక్షణ శిబిరం నిర్వహించినట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.మారుతి వరప్రసాదు తెలిపారు. శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు రక్షణ కవచంలా వారిని ఆదుకునేందుకు సేవాదళ్ కార్యకర్తలు పనిచేస్తారని తెలిపారు. ఈనెల 23వ తేదీ నుంచి ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్ర మహాసభలలో సేవాదళ్ కార్యకర్తలు ప్రజా ప్రదర్శనలో అగ్రభాగాన రెడ్ షర్ట్స్ వలంటీర్స్ ఫాస్ట్ మార్చ్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.సుబ్బారావు, సిహెచ్ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

వినాయక చవితి సంబరాలు ప్రారంభం



నాదెండ్ల: గ్రామాల్లో వినాయక చవితి సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆలయాలు, చలువ పందిళ్ళలో గణపతిని ప్రతిష్టించనున్నారు. మేజర్ పంచాయతీ గణపవరంలో సుమారు 20–25 విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం గణపవరం గ్రామంలోని సినిమా హాల్ వీధిలో ఓ భారీ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై తీసుకొచ్చి ప్రతిష్ఠించేందుకు యువత ఏర్పాట్లు చేశారు. 3–7 రోజుల వరకూ ప్రత్యేక పూజలు, నిమజ్జనం నిర్వహించనున్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోండి

నరసరావుపేట: ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా వల్లప్పచెరువు నీటితో నిండి ప్రమాదకరంగా తయారైందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని పట్టణ వినియోగదారుల సంఘ ఉపాధ్యక్షుడు కుంచాల స్వామి ఆదివారం కోరారు. చెరువులోని నీరు అలుగు పైగుండా రెండుమూడు అడుగుల ఎత్తున ప్రవహిస్తుందన్నారు. దీని వలన సుమారు 12 గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలుగుపై గుండా నీరు ప్రవహించటం వలన పాచిపట్టి ద్విచక్ర వాహనదారులు, పాదచారులు జారిపడుతున్నారన్నారు. గతంలో వర్షాల కారణంగా మట్టికొట్టుకుపోయి చెరువుకు గండ్లు పడ్డాయని, అవి పెద్దవై కట్టలు తెగి ఆ నీరు వలన స్టేడియం, టీసీ, సీటీ కాలనీలు మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికారులు తక్షణమే ఆ ప్రాంతాన్ని సందర్శించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధిపై చర్చకు మేం సిద్ధం

టీడీపీ సోషల్ మీడియా అసత్య ప్రచారాలను ఖండించిన వైఎస్సార్ సీపీ యూత్ నాయకులు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాజా, నరేంద్ర తదితరులు

వినుకొండ: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ యూత్ అధ్యక్షుడు రాజా, నాయకుడు బిక్కి నరేంద్ర పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో వినుకొండ నియోజకవర్గంలో బొల్లా బ్రహ్మనాయుడు హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రస్తుత ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

- టీడీపీ నాయకులు అభివృద్ధిపై మాట్లాడిన అసత్య ప్రచారాన్ని ఖండించారు. గతంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంబధించి శిలాఫలకాలు మార్చకోవడం, అక్రమ కేసులు బనాయించడం, 60 ఏళ్ల పైబడిన వృద్ధుడిపై లైంగికదాడి కేసులు నమోదు చేయడం వంటి దుర్మార్గపు చర్యలు తప్ప ఎక్కడా అభివృద్ధి జరిగిన దాఖలాలు లేవని విమర్శించారు.
- ఆగస్టు 15వ తేదీన ఛీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు జాతీయజెండాను బూటు కాళ్లతో తొక్కి అవమానించడం పట్టణ ప్రజలంతా చూశారని, పైపెచ్చు ఆ ఫొటోలు టీడీపీ కార్యాలయం నుంచి ప్రచారం చేసింది మీరుకాదా అని ప్రశ్నించారు. ఆఘటనను మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఖండిస్తే మా నాయకులపై ప్రేలాపనలు పేలడం దారుణమన్నారు. అనంతరం ఎమ్మెల్యే జీవీ తాను పొరపాటుగా జాతీయజెండాను తొక్కానని, అందుకు క్షమించాలని మీడియా సమావేశం ఏర్పాటు చేసి మరీ క్షమాపణ కోరారన్నారు. అదికూడా గమనించకుండా టీడీపీ కార్యాలయం నుంచి మళ్లీ వైఎస్సార్ నాయకులను రెచ్చగొడుతూ పోస్టులు పెట్టడంపై ఖండించారు. సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కళ్లం అనీల్, యూత్ నాయకులు తదితరులు ఉన్నారు.

గుంతలతో చింత

- గుంతలతో నిండిన రహదారులు
- ప్రమాదాల బారిన వాహనదారులు



డీమార్ట్ ఎదుట రోడ్డు మధ్యలో ఏర్పడ్డ గుంత



హార్ట్ కళాశాల ఎదుట రోడ్డుపై ప్రమాదభరితంగా గుంత

నరసరావుపేట టౌన్: పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై ఏర్పడ్డ గుంతలు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ఆ మార్గంలో ప్రయాణించాలంటే భయపడాల్సిన దుస్థితి. గుంతలను తప్పించబోయి అనేక మంది వాహనదారులు జారి పడ్డ సందర్భాలు లేకపోలేదు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో రోడ్లు ఇంత దారుణంగా ఉంటే గ్రామీణ ప్రాంతాల పరిస్థితి ఏమిటంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఓవర్ బ్రిడ్జి వైపునకు వచ్చే మార్గంలో ప్రధాన రహదారి దారుణంగా తయారైంది. డీమార్ట్, హార్ట్ జూనియర్ కళాశాల ఎదుట, రోడ్డుకు మధ్యలో ఏర్పడ్డ పెద్దపెద్ద గుంతలతో తరుచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

- గుంటూరు రోడ్డు స్వర్గపురి నుంచి నరసరావుపేట పట్టణానికి వచ్చే దారిలో ఏర్పడ్డ గుంతల వల్ల ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఓవర్ బ్రిడ్జి ప్రక్క రహదారి వీరయ్య చౌదరి ఆసుపత్రి సమీపంలో రోడ్డు మధ్యలో పెద్ద గుంత ఏర్పడింది. అదేవిధంగా చిలకలూరిపేట రోడ్డు, రావిపాడు రోడ్లలో అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. ఎన్నో నెలలుగా సమస్య ఉన్నప్పటికీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టిన దాఖలాలు కనిపించలేదు. ఇకనైనా అధికారులు స్పందించి గుంతలుగా ఏర్పడ్డ రహదారులకు మరమ్మతులు చేపట్టి సురక్షిత మార్గాలకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కనులపండువగా గోకులాష్టమి వేడుకలు



కోలాట ప్రదర్శనలో మహిళలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

యడ్లపాడు: మండల కేంద్రమైన యడ్లపాడులో గోకులాష్టమి వేడుకలు శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగాయి. పల్లెలో పండుగ శోభ వెల్లివిరిసింది. ముఖ్యంగా కొత్తూరులోని యాదవరాజుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. రాధాకృష్ణుల ప్రతిమలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిరిలో అలంకరించగా, భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు, భజనలు నిర్వహించారు. కృష్ణుని, జన్మ వృత్తాంతాన్ని కీర్తిస్తూ ఆలపించిన భజనలు, కీర్తనలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని పెంపొందించాయి. అర్ధరాత్రి వరకు సాగిన ఈ వేడుకల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రదర్శనలు భక్తులకు కనువిందు చేశాయి. భక్తులందరికీ వివిధ రకాల ప్రసాదాలను పంపిణీ చేశారు. చిన్నారులు కృష్ణుని, గోపికల వేషధారణలో ఉత్సాహంగా పాల్గొని అందరినీ అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని యాదవరాజులు తెలిపారు.

కృష్ణాష్టమి వేడుకలు..

వినుకొండ: పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ఉన్న సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. శ్రీ కృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకల్లో యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతేకాకుండా ఆలయ ప్రాంగణంలో జరిగిన కోలాటాలు, భజన కార్యక్రమాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో నిండిపోయింది. ఆలయ ధర్మకర్త కనపర్తి వెంకట్రావు, ఎండ్లూరి సతీష్, గాలం బ్రహ్మజీ, జడా వెంకట్రావు, బత్తుల రాజయ్య, గాలం ప్రసన్న, నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తీవ్ర వాగ్వాదం.. వ్యక్తికి కత్తిపోట్లు

శావల్యాపురం: వాటర్‌బాటిల్ కొనేందుకు పోటీపడిన ఇరువురు వ్యక్తుల మధ్య జరిగిన వాగ్వాదం కత్తిపోట్ల వరకు వెళ్లింది. ఈ సంఘటన మండల కేంద్రమైన శావల్యాపురంలో శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఇర్లపాడు గ్రామానికి చెందిన ఊట్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి ట్రావెల్స్ నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. శనివారం రాత్రి వినుకొండలో పనులు ముగించుకుని స్వగ్రామమైన శావల్యాపురం వెళుతూ ప్రభుత్వ వైద్యశాల వద్దనున్న దుకాణం వద్ద వాటర్‌బాటిల్ కోసం ఆగాడు. అదేసమయంలో చినకంచర్ల గ్రామానికి చెందిన పూరేటి గణేష్ కూడా అక్కడ ఆగి వాటర్ బాటిల్ కావాలని దుకాణదారుడిని అడిగాడు. ఇద్దరూ నాకు ముందు కావాలంటే నాకు ముందు కావాలంటూ దుకాణదారుడిపై ఒత్తిడి తెచ్చారు. మాటామాటా పెరిగి గణేష్ పక్కనే ఉన్న ఉల్లిపాయల కత్తితో శ్రీనివాసరావును పొడిచి పరారయ్యాడు. గాయపడిన శ్రీనివాసరావును స్థానికులు వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. నిందితుడు ఆదివారం శావల్యాపురం పోలీసులకు లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దేవతామూర్తులకు బోనాలు సమర్పణ

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలోని రేగుమాణ్యం కాలనీకి చెందిన భక్తులు దేవతామూర్తులైన కుర్రం, ముత్యాలమ్మ, గంగమ్మ, కులదేవరకు ఆదివారం భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. ఆవుల మంగమ్మ, బాలస్వామి, ప్రతాప్ నేతృత్వంలో భక్తులు బోనాలను మేళాతాళాలతో ఉత్సాహంగా... ఉల్లాసంగా దేవతలకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

రాజుపాలెం: మండల కేంద్రమైన రాజుపాలెంలో వేంచేసి ఉన్న పద్మావతీ గోదా సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా ఆదివారం నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం మూడవ రోజు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. కల్యాణ మహోత్సవంలో 20 జంటలు పాల్గొన్నాయి. వివిధ పుష్పాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కల్యాణ మహోత్సవంలో దేవస్థాన వ్యవస్థాపకులు, బాలాజీ ట్రస్ట్ చైర్మన్ పొత్తూరి వెంకట రమసుబ్బారావు దంపతులు పాల్గొని కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం స్వామి వార్లను రథంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. కట్టవారిపాలెం మహిళల కోలాటం గ్రామస్తులను ఆకట్టుకుంది. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం రాత్రి శ్రీకృష్ణ రాయబారం పద్య నాటకం నిర్వహించగా చూపరులను ఆకట్టుకుంది.

రామాలయ పునర్నిర్మాణానికి సహకరిస్తాం

విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు



అచ్చంపేట: మండలంలోని కోగంటివారిపాలెంలో రామాలయ పునర్నిర్మాణానికి తమ వంతు సహకారం ఉంటుందని పల్నాడు జిల్లా విశ్వహిందూ పరిషత్ ప్రముఖులు రవికుమార్, మట్టుపల్లి సుబ్బారాయుడు తెలిపారు. మండల ప్రముఖ్ తుమ్మా మర్రెడ్డి ఆధ్వర్యంలో కోగంటివారిపాలెంలో ఆదివారం సాయంత్రం రామాలయ ఆవరణలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామంలో రామాలయం జీర్ణోద్ధరణకు గురయ్యే అవకాశం ఉన్నందున పునర్నిర్మాణానికి నిధులు సమకూర్చమని గ్రామస్తులు కోరగా వారు వెంటనే స్పందించారు. రామాలయ పునర్నిర్మాణంలో హిందూ పరిషత్ భాగస్వామి అవుతుందని స్పష్టం చేశారు. అనంతరం గోరక్షా గ్రామ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.